



- బత్తినయ్యకోనకు వెళ్లి చిక్కుకుపోయిన భక్త బృందం
- స్థానికుల సాయంతో కాపాడిన రెవెన్యూ, పోలీసులు

వానలో.. అడవిలో 36h గంటలు

ఏర్పేడు మండలం బత్తినయ్యకోనకు వెళ్లి శ్రీకాళహస్తికి చెందిన 22 మంది భక్తులు 36 గంటలపాటు అడవిలో చిక్కుకుపోయిన సంఘటన ఆందోళనకు గురి చేసింది. ఆదివారం బయలుదేరిన వీరు మంగళవారం సాయంత్రం దాకా కూడా తిరిగి రాకపోవడంతో అందరూ ఆందోళన చెందారు. వానలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటలేక, అడవిలో దారి తెలియక, సెల్‌ఫోన్లు పనిచేయక, తిండికూడా లేక పసిబిడ్డలు మొదలు ముసలివాళ్ల దాకా విలవిలలాడిపోయారు. ముసలిపేడు స్థానికుల ధైర్యసాహసాలు, రెవెన్యూ, పోలీసుల సహకారంతో వీరంతా మంగళవారం రాత్రికి సురక్షితంగా అడవి దాటి బయటకు వచ్చారు. ఈ సంఘటనలన్నీ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలా సాగాయి.

బత్తినయ్యకోన నుంచి టార్చిలైట్ సాయంతో అడవిలో వస్తున్న భక్తులు

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం బత్తినయ్య కోనలోని భక్తకంఠేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి నిద్ర చేస్తే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. శ్రీకాళహస్తికి చెందిన 45 మంది ఆదివారం ట్రాక్టర్‌లో ముసలిపేడుకు చేరుకున్నారు. ఆ రాత్రి అక్కడే పడుకుని, తెల్లవారుజామునే నడక మొదలు పెట్టారు. సోమవారం ఉదయం బత్తినయ్య కోనకు చేరుకున్నారు. పూజలు చేసుకుని 23మంది సోమవారం సాయంత్రానికి తిరిగి వచ్చేశారు. కార్తీక సోమవారం రాత్రి భక్తకంఠేశ్వరస్వామి సన్నిధిలో నిద్రిస్తే మంచిదని మిగిలిన 22మంది అక్కడే ఉండిపోయారు. మంగళవారం ఉదయం లేచి కొండ దిగడం మొదలు పెట్టారు. ఒకవైపు వాన.. మరోవైపు చలి.. దారిలో పంబ కాలువ ఉధ్రుతంగా ప్రవహిస్తుండటంతో దాట లేకపోయారు. ఫోన్లు పనిచేయకపోవడంతో ఇళ్లకు సమాచారమిచ్చే వీలు లేకపోయింది. సాయంత్రం అవుతున్నా వాగు ఉధ్రుతి తగ్గలేదు. ఆకలి.. భయం.. ఆందోళన పెరిగిపోయాయి. నిజానికి వాగు దాటకుండా అడవిలో నడిచి బత్తినయ్య గిరిజనకాలనీకి చేరుకునే వీలుంది. వీరికి ఆ అడవిమార్గం తెలియలేదు. వీరిలో జంగం దేవర కుమారుడి ఫోన్ ఒక తావులో పనిచేయడంతో ముసలిపేడుకి సమాచారం ఇచ్చాడు. ముసలిపేడు వాసులు ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ముసలిపేడు గ్రామానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. భక్తులు చిక్కుకుపోయిన వాగు వద్దకు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌సాయంతో అధికారులు కాలువను దాటడానికి ప్రయత్నించినా నీటి ఉధ్రుతి పెరుగుతూనే ఉండడంతో సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నలుగురు స్థానికులు సాహసించి తాడు సాయంతో కాలువ దాటి అవతలకు వెళ్లారు. అప్పటికే చిక్కుకుపోయిన వారు తిండిలేక నీరసించిపోయి ఉన్నారు. వారిని అడవిదారిలో బత్తినయ్య గిరిజనకాలనీకి తీసుకువచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని డోలిలో కిందకు మోసుకువచ్చారు. 22 మందికీ పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేశారు. కోన నుంచి ముసలిపేడుకు చేరుకున్న భక్తులకు టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, మనోహర్‌నాయుడు, అంకయ్య ఆధ్వర్యంలో భోజనం అందించారు. అక్కడ్నుంచి సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. తమను కాపాడిన అధికారులకు, ముసలిపేడు వాసులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తులను పలకరిస్తున్న అధికారులు





వృద్ధురాలిని జోలి కట్టి తీసుకొస్తున్న స్థానికులు



మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల్లో లీకేజీ

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల నుంచి మంగళవారం నీరు లీకేజీ అవుతోంది. డ్యాం డీఈ చంద్రమౌళిని వివరణ కోరగా.. అది సాధారణ లీకేజీ అని ఎటువంటి సమస్య లేదని చెప్పారు.

ఆలస్యంగా నడిచిన ఇండిగో విమానాలు

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షం నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి 10.35కు రేణిగుంటకు రావాల్సిన ఇండిగో విమానం మధ్యాహ్నం 1.20 గంటలకు వచ్చింది. 1.55 గంటలకు తిరిగి బయలుదేరింది. సాయంత్రం ముంబై నుంచి 5.20కి చేరుకోవాల్సిన విమానం 2 గంటలు ఆలస్యంగా వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు.

- అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు

5లోపు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 25 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం సూచించారు. మండలాల వారీగా ఖాళీలనుబట్టి ఎంఆర్సీలకు దరఖాస్తులు సమర్పించాలి. స్థానికులకు ప్రాధాన్యత ఉంటుంది. 75 శాతం అకడమిక్ మార్కులు, 25 శాతం ప్రొఫెషనల్ అర్హతా మార్కులు ఉండాలి. 7లోగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి, 8వ తేదీ నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు. ఈనెల 8 నుంచి వచ్చే ఏడాది మే 7వ తేది వరకు మాత్రమే ఈ నియామకం వర్తించనుంది.

కొనసాగుతున్న వాయుగుండం

- మరో 24 గంటలపాటు భారీ వర్షాలు
- తీరప్రాంతాల్లో జోరు వాన
- వాకాడులో అత్యధికంగా 92.8 మి.మీ



వడమాలపేట మండలం కల్లూరు వద్ద నక్కలవాగు ప్రవాహం



కోట మండలం తిన్నెలపూడి వద్ద వరిపైరులో నీటి ప్రవాహం



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది ప్రవాహం

సూళ్లూరుపేట/తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలహీనపడిన దిత్వా తుఫాను స్థిరంగా ఉంది. ఇది నైరుతి దిశగా పయనించి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తర తమిళనాడు తీరాన్ని ఆనుకొని ఉన్నట్లు తెలిపారు. దీని ప్రభావంతో మరో 24 గంటల పాటు జిల్లాలో భారీ వర్షాలు పడనున్నాయని చెప్పారు. ఇక, మంగళవారం తీరప్రాంతాల్లో భారీ వర్షం పడింది. తూర్పు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మొంథా తుఫానుతో చెరువులు నిండగా.. ఇకపై భారీ వర్షాలు కురిస్తే తెగిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాకాడులో 92.8.మి.మీ. చిట్టమూరు 87.2, తడ 80.8, దొరవారిసత్రం 64, కోట 58.2, సత్యవేడు 57, సూళ్ళూరుపేట 55, బీఎన్‌కండ్రిగ 50.6, వరదయ్యపాలెం 46.8, వడమాల పేట31.6,నాయుడుపేట 25.8, కేవీబీపురం 22.2మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 24.5మి.మీ.గా ఉంది. చిన్నగొట్టిగల్లు, బాలాయపల్లి, చంద్రగిరి, పాకాల, పిచ్చాటూరు, డక్కిలి, గూడూరులో వర్షపాతం నమోదు కాలేదు.

- వడమాలపేట మండలం కల్లూరు వద్ద నక్కల వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు ఆపేశారు.
- కేవీబీపురం మండలం తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువ ప్రవాహంతో పిచ్చాటూరు- శ్రీకాళహస్తి మధ్య రాకపోకలు ఆగాయి.
- ఏర్పేడు మండలం మోదుగులపాళెం-కొత్తవీరాపురం మధ్య స్వర్ణముఖినది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామీణులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.
- పలు ప్రాంతాల్లో నదీ ప్రవాహాలు, వంతెనల వద్ద పరిస్థితిని అధికారులు పరిశీలించారు. స్థానికులను అప్రమత్తం చేశారు.
- కాళంగి జలాశయం నీటిమట్టం 18.6 అడుగులకు చేరడంతో నాలుగు గేట్లు ఎత్తి నీటిని వదిలారు.
- వాకాడు వద్ద స్వర్ణముఖినది బ్యారేజీలోకి 7వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 8 గేట్లను ఎత్తారు.
- కోట మండలంలో దొరువుకట్ట, దైవాలదిబ్బవద్ద బలహీనంగా ఉన్న స్వర్ణముఖి నది కరకట్టలు ప్రమాదకరంగా మారాయి. శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం 30 మీటర్లు ముందు కొచ్చి కోతకు గురైనట్లు మత్స్యకారులు చెబుతున్నారు.







డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనరు మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు

'గ్రేటర్ తిరుపతి'కి సహకరించండి

- డీఆర్సీ సమావేశంలో మంత్రి అనగాని పిలుపు
- చంద్రగిరి గ్రామాల విలీనం వద్దన్న ఎమ్మెల్యే నాని
- గ్రేటర్ ప్రతిపాదనపై తమను సంప్రదించలేదన్న ఎమ్మెల్యే సుధీర్

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్' ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. అందులో భాగంగానే గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన రూపుదిద్దుకుందన్నారు. ప్రస్తుతం 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న తిరుపతి కార్పొరేషన్‌ను.. మరింతగా అభివృద్ధి పరచడానికి అదనంగా 270 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించాల్సి ఉందన్నారు. శెట్టిపల్లె లబ్ధిదారులకు నిర్ణీత గడువులోగా పట్టాలు అందించాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయవద్దని ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రిని కోరారు. ఇక్కడున్న వారంతా రైతులు, పేదలేనన్నారు, విలీనం వల్ల ఇళ్లకు పన్నులు పెరగడం.. ఖాళీ స్థలాలకూ పన్నులు చెల్లించాల్సి రావడం భారమవుతుందన్నారు. ఈ అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రేటర్ తిరుపతిలో రేణిగుంట మండలం మొత్తాన్ని చేర్చాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు. గ్రేటర్‌కు తాము సంపూర్ణంగా సహకరిస్తామని, అయితే, ఈ ప్రతిపాదనపై తమను సంప్రదించలేదన్నారు. తమకు అవగాహన కల్పిస్తే పంచాయతీల్లో ప్రజలకు వివరించడానికి వీలవుతుందన్నారు.

గూడూరును నెల్లూరులో కలపండి

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంత్రిని కోరారు. అప్పుడే తమ నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలా అనుకూలంగానూ, సౌకర్యంగానూ ఉంటుందన్నారు. జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేశాకే ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేసిందని మంత్రి సమాధానమిచ్చారు. అభ్యంతరాలు తెలియజేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్

పర్యావరణంపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచడంతో పాటు పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అనగాని అన్నారు. అందులో భాగంగా పులికాట్ కేంద్రంగా వచ్చే ఏడాది జనవరి 11, 12 లేదా 17, 18 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రధాన దృష్టి

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తిరుపతి నియోజకవర్గంలో 22ఏ నిషేధిత జాబితాలోని భూములు దేవదాయ శాఖ పరిధిలో లేకుంటే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల నిర్మాణాలకు.. పలు తహసిల్దారు కార్యాలయాల భవనాల మరమ్మతులకూ నిధులు కేటాయిస్తామన్నారు.

మొంథా.. ముంపు బాధితులకు సత్వర సాయం

మొంథా తుఫానులోను, కేవీబీపురం మండలం ఓలూరు రాయలచెరువు కట్ట తెగిన సమయంలోనూ బాధితులకు సత్వర సాయం అందించగలిగామని గణాంకాలు సహా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఈనెల 22లోగా శెట్టిపల్లె భూముల అభివృద్ధి పనులు పూర్తి చేసి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. గ్రేటర్ తిరుపతిలో 63 పంచాయతీలను విలీనం చేయాల్సి ఉండగా 13మాత్రమే ఆమోదం తెలిపాయన్నారు. హథీరాంజీ మఠం భవన పునరుద్ధరణ విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు.మూడు గంటలకుపైగా సాగిన సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, బల్లి కళ్యాణ చక్రవర్తి, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, రుద్రకోటి సదాశివం తదితరులతో పాటు కమిషనర్ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మా లక్ష్యం.. వైబ్రెంట్ తిరుపతి

'వైబ్రెంట్ తిరుపతి' లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణకు దిగుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు కేంద్రంగా మారనున్న తిరుపతి ప్రాంత అభివృద్ధికి గ్రేటర్ ప్రతిపాదన మంచి పరిణామమన్నారు. స్వర్ణముఖి బ్యూటిఫికేషన్ ద్వారా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పుట్టపర్తిలో చిత్రావతి నదికి చెక్‌డ్యామ్ కట్టిన తీరులో స్వర్ణముఖిపైనా చెక్‌డ్యామ్, లేజర్ షో వంటివి ఏర్పాటుచేసే ఆలోచన ఉందన్నారు. దేవదాయ శాఖ, మఠం భూములపై డీఆర్సీలో చర్చించామన్నారు. జిల్లాలో 36శాతం అటవీ భూములు ఉండటంతో సరిహద్దు భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

పోర్టు కోసమే గూడూరు కొనసాగింపు

'ప్రకాశం జిల్లాకు రామాయపట్నం, నెల్లూరు జిల్లాకు కృష్ణపట్నం పోర్టులున్నాయి. తిరుపతి జిల్లాకూ ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావన. అందుకే దుగరాజపట్నం పోర్టు ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోనే కొనసాగించాలని నిర్ణయించారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఎయిర్‌పోర్టు, నేషనల్ హైవేస్ కనెక్టివిటీ ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి కీలకమన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు, సంఘాలు తనను కోరారన్నారు. గూడూరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు సీఎం స్థాయిలో లోతైన సమీక్ష చేశారన్నారు. కొన్ని కారణాలతో తిరుపతిలోనే కొనసాగించాలని సీఎం భావిస్తున్నారన్నారు.

కులానికి, రాజకీయాలకు సంబంధం లేదు

'సత్యవేడు ఎమ్మెల్యేకి ఇవ్వాల్సిన గౌరవం, ప్రాధాన్యం ఇస్తున్నాం. డీఆర్సీ సమావేశంలోనూ ఎమ్మెల్యే ఆదిమూలం నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధికి సంబంధించి వినతి పత్రాలు అందజేశారు. కొన్ని తప్పిదాలమూలంగా కొందరు ప్రజలకు దూరమవుతారు. ప్రొటోకాల్‌పరంగా సమస్యలున్నాయని ఎమ్మెల్యే భావిస్తే శాసనసభలో ప్రివిలేజ్ కమిటీ వంటి వేదికలున్నాయి' అని మంత్రి సత్యప్రసాద్ చెప్పారు. కులానికి, రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టంచేశారు.

వకుళమాత సేవలో మంత్రి సత్యప్రసాద్



వకుళమాత అమ్మవారిని దర్శించుకుని బయటకు వస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం పేరూరు బండపై కొలువైన వకుళమాత అమ్మవారిని మంగళవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. ఈయనకు అలయ అర్చకులు వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రమాదేవికి గౌరవ డాక్టరేట్



రమాదేవిని అభినందిస్తున్న టీచర్లు

తిరుపతి(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ విద్యాసంస్థల అధ్యక్షురాలు ఎం.రమా దేవికి గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. విద్య, సామాజిక, సాంఘిక సేవా కార్యక్రమాల్లో ఆమె సేవలకు గుర్తింపుగా గౌరవపురస్కారాన్ని ప్రదానం చేశారని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ కేఆర్ శ్వేతరెడ్డి, సొసైటీ సభ్యులు ఎం.శేఖర్‌రెడ్డి, సి.అరవింద్‌రెడ్డి, కేఆర్ సుస్మిత, ఎంసీ లక్ష్మి, ప్రిన్సిపాల్ వై.పద్మశ్రీ, టీచర్లు దుశ్శాలువాతో సన్మానించి అభినందించారు.

ఉరుస్తున్న పాఠశాలలు



వీఆర్ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉరుస్తున్న భవనం పైకప్పు

ఎర్రావారిపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు వర్షాలకు ఉరుస్తున్నాయి. ముఖ్యంగా ఎల్లమంద, వీఆర్ అగ్రహారం, నెరబైలు, పచ్చార్లవాండ్ల పల్లె పాఠశాలలు చిన్న పాటి వర్షాలకే ఉరుస్తున్నాయి. శ్లాబ్ నుంచి నీటి చుక్కలు పడుతుండడంతో పుస్తకాలు, సంచులు తడిసిపోతున్నాయి. విద్యార్థులు తరగతి గదుల్లో ఉండ లేని పరిస్థితి నెలకొంది. కాగా చాలా పాఠశాల భవనాలను ఆయా పాఠశాలల చైర్మన్లు నిర్మించారు. దీంతో హెచ్‌ఎంలో ఏమీ చెప్పలేకపోవడంతో నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పొలాలపై ఆగని గజదాడులు



ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

భాకరాపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై గజ దాడులు ఆగడం లేదు. సోమవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెకు చెందిన కాలేపల్లె చంద్రశేఖరరెడ్డికి చెందిన వరి పైరును, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన చలపతిరెడ్డి, శంకరయ్య, సురేంద్రరెడ్డి, ఎం.చంద్రశేఖర్ రెడ్డికి చెందిన మిరప, అలసంద, మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. ధ్వంసమైన పంటను అటవీ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరు మార్పు





దాత శివప్రసాద్ రెడ్డి నిర్మించిన భవనాలు, జడ్పీ మాజీ చైర్మన్ సిద్ధరామిరెడ్డి (ఫైల్ ఫొటో)

భాకరాపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరును మార్పు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1984లో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నత గదులలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమం లో జడ్పీ మాజీ చైర్మన్ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి కుమారుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన శివప్రసాద్ రెడ్డిని కళాశాలకు నూతన గదులు నిర్మించాలని కోరగా ఆయన అంగీకరించారు. ఆ మేరకు నిర్మాణాలు చేపట్టారు. కళాశాలకు తన తండ్రి సిద్ధరామిరెడ్డి పేరు పెట్టాలని దాత శివప్రసాద్ రెడ్డి కోరారు. ఆ మేరకు ప్రభుత్వం జూనియర్ కళాశాల పేరును శ్రీ వి.సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల భవనాలు నిర్మాణాలు పూర్తయ్యాక అధికారికంగా ఆ పేరు అమల్లోకి రానుంది.

రేపటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువణ్ణామలైకి గురువారం నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సెంట్రల్ బస్సుస్టేషన్ ఏటీఎం ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పున్నమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం వేకువజామున 4 నుంచి శుక్రవారం ఉదయం 11గంటల వరకు ప్రతి అరగంటకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 99592 256784లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మాల్వాడిగుండంలో 'రీల్స్'

● ఒడిశా యువకులకు పోలీసుల కౌన్సెలింగ్



పోలీసు స్టేషన్‌లో యువకులు

తిరుపతి(నేర విభాగం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాల్వానిగుండం కాలువలో జలపాతం పరవళ్ళు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో కొందరు యువకులు మంగళవారం ప్రమాదకరమైన కొండపై నుంచి రీల్స్ చిత్రీకరించారు. ఎస్‌ఐ లోకేశ్‌బాబు తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన ముఖేష్, పీతల్, ములుషబికార్, బిశ్వంత్, ప్రసాద్‌నౌరి, లింగం ప్రదీప్ తిరుపతికి వలస వచ్చారు. ఇక్కడ కూలి పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. వీరు జీవకోన నుంచి అడ్డదారిలో శేషాచలం అడవుల్లోకి వెళ్లి.. మాల్వానిగుండం వద్దకెళ్లారు. ప్రమాదకరమైన కొండ పై నుంచి సరదాగా రీల్స్ చేస్తున్నారు. దీన్ని గమనించిన కొందరు స్థానికులు అలిపిరి ఏపీఎస్వో రమేష్‌కృష్ణకు సమాచారమిచ్చారు. ఆయన సిబ్బందితో కలసి వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అలిపిరి పోలీసులకు అప్పగించారు. ఇక్కడ ఎస్‌ఐ లోకేష్‌బాబు వారి వివరాలు తెలుసుకున్నారు. ఇలా కొండపై నిలబడి రీల్స్ చేస్తే జరిగే పరిణామాలు గురించి వారికి వివరించారు. భవిష్యత్తులో ఇలా చేస్తే కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించి వదిలిపెట్టారు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు

● కాలుష్యానికి స్థానికుల ఉక్కిరిబిక్కిరి



ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

తిరుచానూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ గుజిరి వ్యాపారి తిరుచానూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటాడు. ఈ క్రమంలో పూర్తిగా పనికిరాని వ్యర్థాలను తిరుచానూరు- పాడిపేట మార్గంలో స్వర్ణముఖి తీరానికి చేరుస్తాడు. అక్కడ వాటికి నిప్పు పెడుతూ ఉంటాడు. ఆ కాలుష్యానికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో రాత్రిపూట నిప్పు పెట్టేవారు. ఇప్పుడు పగటిపూటే నిప్పు పెడుతుండడంతో పొగతో స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అతనిపై చర్యలు తీసుకుని ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పుపెట్టకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సాంఘిక శాస్త్ర సబ్జెక్టు తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు మార్కండేయులు నాయుడు, జయ వేలు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ సాంఘికశాస్త్ర సబ్జెక్టును బోధించేందుకు టెట్, డీఎస్సీ అర్హత పొందిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఎంపికైన వారికి రూ.12,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 8వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8523889992 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ సిబ్బంది

భాకరాపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకటరమణ తెలిపారు. భాకరాపేట అటవీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి తలకోన అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం తమిళనాడు రాష్ట్రానికి అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం వచ్చింది. ఆ మేరకు భాకరాపేట -తలకోనరోడ్డులోని తవ్వావాండ్లపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున ఓ కారును ఆపారు. స్మగ్లర్లు కారును ఆపేసి పరారయ్యారు. కారులో 280 కిలోల 9 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారు సహా ఎర్రచందనం సుమారు రూ.12 లక్షలు విలువచేస్తుంది.

నిండుతున్న రాయలచెరువు



రామచంద్రాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువుకు భారీగా నీరు చేరుతోంది. నీటిని కొలిచే ఏడవ మిద్దె పూర్తిగా మునిగిపోయింది. నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు అనుపల్లి, పిళ్లారికోనచెరువులు మరువ పారుతున్నాయి. అనుపల్లి నుంచి వచ్చే సుద్దేటివంక ఉధృతంగా ప్రవహించి రాయలచెరువులో కలుస్తోంది. రాయలకాలంలో నీటిని కొలిచేందుకు ఏర్పాటుచేసిన ఏడుమిద్దెలలో ఐదు 50 ఏళ్ల కిందటే పూడికతో పూడుపోయాయి. ప్రస్తుతం ఉన్న రెండు మిద్దెలు నీట మునిగాయి. దీంతో చెరువు సగానికి పైగా నిండినట్లయింది. సుద్దేటి వంక రెండు నెలల పాటు ప్రవహించి రాయలచెరువుకుచేరుతోంది. చెరువులోనూఊటపుట్టి నీటిమట్టం పెరుగుతోంది. రెండేళ్లకుపైగా సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు.

సఖి వన్‌స్టాప్ సెంటర్ వాహనం ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో హింసకు గురవుతున్న మహిళలు ఎవరైనా సరే సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సఖి వన్‌స్టాప్ సెంటర్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే మహిళలు ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు ఫిర్యాదుచేయవచ్చన్నారు. వైద్యం, పోలీసుల సాయం అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, నెలవల విజయశ్రీ, డీఆర్వో నరసింహులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ డివిజన్ ఏర్పాటుకు కృషి

● సాధన కమిటీకి టీడీపీ లోకసభ ఫ్లోర్ లీడర్ కృష్ణదేవరాయలు హామీ



ఢిల్లీలో ఎంపీ కృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే డివిజన్ సాధనసమితి నాయకులు

తిరుపతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషిచేస్తానని టీడీపీ పార్లమెంటు ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు అన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటీ సభ్యులు మంగళవారం న్యూ ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంగా లావు కృష్ణ దేవరాయలను కలిసి వినతిపత్రం అందజేశారు. బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానన్నారు. దీనిపై బుధవారం రైల్వే మంత్రితో అపాయింట్‌మెంట్ తీసి ఇస్తానని, కూటమినేతలతో సమావేశం ఏర్పాటుచేయిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎస్‌ఎఫ్‌ఐఆర్ రాఘవయ్యను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, డాక్టర్ వీసీ రాయలు, ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

నేడు చంద్రగిరిలో గంగమ్మ జాతర

● గట్టి పోలీస్ బందోబస్తు





స్వర్ణముఖినదిలో గోతి తీసి, గంగమ్మ ప్రతిమ తయారు చేయడానికి పూజలు చేస్తున్న దృశ్యం, చంద్రగిరి గ్రామ పినపెద్దలతో ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో నాలుగు బలి ప్రాంతాలైన పాతపేటలోని దిగువవీధి, ఆకుతోటవీధి, కొత్తపేటలోని జమండ్లవీధి, దాసరివీధిలలో గంగమ్మ జాతరను మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు అనిత, భక్తవత్సలం, రవీంద్రనాయక్, మురళీ మోహన్‌లతో పాటు 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మంగళ వారం ఉదయం నుంచే చంద్రగిరి, పరిసర ప్రాంతాలలో ఉన్న మద్యం దుకాణాలను మూసి వేయాలని నిర్ణయించారు. గ్రామ పినపెద్దల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. స్వర్ణముఖి నదిలో గంగమ్మ ప్రతిమలను తయారు చేయడానికి ఎక్స్‌కవేటర్ సహాయంతో నీరు వచ్చే వరకు సుమారు 15 అడుగుల లోతు తవ్వారు. మంగళవారం రాత్రి అమ్మవారి ప్రతిమల ఊరేగింపు కోసం సప్పరాలను విశేషంగా అలంకరించారు. అర్ధరాత్రి నాలుగు బలి ప్రాంతాల నుంచి గ్రామస్తులు సప్పరాలను తీసుకొని స్వర్ణముఖి నదికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మ ప్రతిమలను తయారు చేసి బుధవారం తెల్లవారుజామున ఊరేగింపుగా బలి ప్రాంతాలకు ప్రతిమలను ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుదీర్చి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించనున్నారు. ఈ జాతర ఏర్పాట్లను గ్రామ పినపెద్దలు, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరుపాక్షి శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు.

జాతరను వైభవంగా నిర్వహించాలి

చంద్రగిరి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామ పినపెద్దలకు, గ్రామస్తులకు సూచిం చారు. మంగళవారం గ్రామ పినపెద్దలు, గ్రామస్తులతో ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ

● రైతులు పొలాలకు వెళ్లకుండా గేటు ఏర్పాటు

● అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు



సర్వే నెంబర్‌లో 34 కాలువ పోరంబోకు స్థలంలో చేపట్టిన నిర్మాణం

చంద్రగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. అంతేగాకుండా ఆక్రమణదారుడు రైతులకు దారి ఇవ్వకుండా గేటు ఏర్పాటు చేశారు. దీనిపై రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి గ్రామ లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ సర్వే నెంబర్ 34లో 2.33 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నెంబర్ 37లో 1.62 సెంట్లు ప్రభుత్వ కాలువ పోరంబోకు స్థలం ఉంది. ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుంది. అయితే 34లో ఉన్న ప్రభుత్వ భూమికి డీకేటీ పట్టా ఉందని ఆక్రమణదారుడు అంటున్నాడు. దానిపక్కనే ఉన్న సర్వే నెంబర్ 37లో ఉన్న కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. 2022లో అప్పటి రెవెన్యూ అధికారులు కాలువ పోరంబోకు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారుడు దీనిపై కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు. ఆ మేరకు ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. ఈ కాలువ పోరంబోకు స్థలానికి అవతలి వైపు రైతుల పొలాలు ఉన్నాయి. ఆక్రమణదారుడు రోడ్డుకు ఆనుకుని ఉన్న తన ఒరిజినల్ పట్టా స్థలంలో వెంచర్ వేశాడు. ఆ వెంచర్‌లోని దారి నుంచి కాలువపోరంబోకు స్థలంలోకి వెళ్లి అక్కడి నుంచి రైతుల పొలాలకు వెళ్లాల్సి ఉంది. అయితే ఆక్రమణదారుడు వెంచర్‌లోకి దారికి అడ్డుగా గేటు ఏర్పాటు చేశాడు. దీంతో రైతుల పొలాలకు దారిలేకుండా పోయింది. దీనిపై రైతులు తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీవో, వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు ఇచ్చారు. వెంచర్‌లో ఉన్న దారి ద్వారా తమ పొలాలకు దారి కల్పించాలని కోరారు.

ఆక్రమణలు అడ్డుకుంటాం

చంద్రగిరి లెక్కదాఖల్లోని సర్వే నెంబరు 34లో ప్రహరీ నిర్మాణం చేపట్టడంపై తహసీల్దార్ శివరామసుబ్బయ్యను వివరణ కోరగా ప్రభుత్వ భూములు, కాలువపోరంబోకు స్థలాలను కాపాడుకొనే బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదేనని తెలియజేశారు. అయితే సర్వే నెంబర్ 34లో ఆక్రమణలు నిలిపేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కాలువ ఆక్రమణలపై కోర్టులో అప్పీలు వేస్తామని పేర్కొన్నారు.

రేపు, ఎల్లుండి వెటర్నరీలో పీజీ విద్యార్థుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న అసోసియేట్‌డీన్ జగపతిరామయ్య, పక్కన రాంబాబునాయక్ తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా గురు, శుక్రవారాలు రెండురోజుల పాటు పీజీ విద్యార్థుల రెండవ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువైద్య శాస్త్రంలో పరిశోధన -నూతన ఆవిష్కరణలు, పశువుల ఆరోగ్యం -ఉత్పాదన ప్రభావం అనే అంశాలపై ఈసదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పీజీ, డాక్టరల్, యూజీ (ఫైనలియర్) విద్యార్థుల సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణల ద్వారా పశువుల్లో వచ్చే వ్యాధులను తగ్గించడం, తద్వారా పాలు, మాంస ఉత్పత్తుల పెంపుతో జాతీయ స్థూల ఉత్పత్తిని పెంచడమే ఈసదస్సు లక్ష్యమని వివరించారు. ఈ సదస్సుకు 8 రాష్ట్రాలకు చెందిన పశువైద్య విద్యార్థులు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. మొత్తంగా 6అంశాలపై చర్చలు ఉంటాయని, ఉత్తమ ప్రతిభచాటిన వారికి అవార్డులు ప్రదానం చేస్తామని చెప్పారు. యూజీ ఫైనలియర్ విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన మూడు జట్లకు అవార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. వెటర్నరీసైన్స్ డీన్ డాక్టర్ ఆర్వీసురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా చెన్నైకి చెందిన ప్రకాశ్‌ఫుడ్స్ చైర్మన్ డాక్టర్ డీవీఆర్ ప్రకాశ్‌రావు, గౌరవఅతిథిగా విశాఖకి చెందిన ఆంకో సీక్ సంస్థ చైర్మన్ డాక్టర్ పూసల సురేష్, వర్సిటీ వీసీ డాక్టర్ జేవీరమణ, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, జీవోటీఎస్ సంస్థ చైర్మన్ డాక్టర్ కిశోర్ ప్రయాగ హాజరవుతారని తెలిపారు. డాక్టర్ బి.రాంబాబు నాయక్, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధీర్, మురళీధర్, చైతన్యకుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బాలదీపాల వెలిగింపు



బాల దీపాల ఊరేగింపు



శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం బాల దీపాలను శాస్త్రోక్తంగా వెలిగించారు. ఏటా కార్తీక పౌర్ణమిని(తమిళ) పురస్కరించుకని మహానంది వద్ద చుక్కాని ఉత్సవం(భరణి దీపం) వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకకు ఒకరోజు ముందుగా బాలదీపాలను వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్ల గర్భాల యాలను శుద్ధి చేశారు. ఆగమ నియమం ప్రకారం అమ్మవారి సన్నిధిలో మంగళవారం రాత్రి వేద పండితులు ప్రత్యేక పూజలతో హోమ జ్వాల నుంచి ఐదు బాలదీపాలను సంప్రదాయబద్ధంగా వెలిగించారు. అనంతరం బాలదీపా లను వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొలువు దీర్చారు. బుధవారం సాయంత్రం బాలదీపాలను వేదపండితులు ఊరేగింపుగా చుక్కాని వద్దకు తీసుకెళ్లనున్నారు. అక్కడ బాలదీపాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం చక్కాణి (భరణిదీపం)ను ప్రజ్వలించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. మంగళవారం రాత్రి బుధవారం భరణి దీపం వరకు బాల దీపాలు నిరంతరం వెలిగేలా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేశారు.

నేడు భరణి దీపం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి చుక్కాని(భరణి దీపం) వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులు విశేషంగా దర్శించుకునేందుకు విచ్చేస్తారు. ఇందుకు అవసరమైన తాటిచెట్టు, మట్టలు, పూజాద్రవ్యాలను అధికారులు సిద్ధం చేశారు.

ఐఐటీలో హ్యాండ్స్ - ఆన్ వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న డాక్టర్ అమిత్ సక్సేనా

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో క్వాంటం నాలెడ్జ్ క్లస్టర్ తిరుపతి ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటం అల్గారిథమ్స్, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్‌పై రెండురోజులపాటు జరిగే జాతీయ స్థాయి హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభ మైంది. ఈ కార్యక్రమం జాతీయ క్వాంటం మిషన్ కింద ఐఐటీ మద్రాస్‌కు చెందిన సంజ్ఞాన క్వాంటం కమ్యూనికేషన్ హబ్ నిధులతో, సీ-డాక్ విజ్ఞాన భాగస్వామ్యంతో ఏర్పాటైంది. వర్క్‌షాప్‌ను డాక్టర్ అరిజిత్ శర్మ, డాక్టర్ అరవింద ఎస్(తిరుపతి ఐఐటీ), డాక్టర్ సంపుద్దసన్యాల్(తిరుపతి ఐసర్) సమన్వయం చేస్తున్నారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్, సీడాక్ పూణే నిపుణులు క్వాంటం టెక్నాలజీపై బోధన, హ్యాండ్స్ ఆన్ శిక్షణ అందించారు. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్, అల్గారిథమ్స్, సెక్యూర్ కమ్యూనికేషన్, ఎర్రర్ కరెక్షన్ వంటి కీలక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. సుమారు 80మంది అధ్యాపకులు, విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా క్యూకేసీటీ కీలక అడుగు వేసిందని ప్రతినిధులు తెలిపారు.

టీటీడీ ఉద్యోగుల బ్రహ్మోత్సవ బహుమానం 10 శాతం పెంపు

● ఆమోదం తెలిపిన ప్రభుత్వం

తిరుమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఏడాది బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతానికి పెంచుతూ టీటీడీ బోర్డు చేసిన తీర్మానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టీటీడీ ఈవో పంపిన ఈ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం 2024 సంవత్సర బహుమానంపై 10 శాతం అదనంగా 2025 బ్రహ్మోత్సవాల కోసం చెల్లించేందుకు అనుమతినిస్తూ ఎండోమెంట్ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శాశ్వత ఉద్యోగుల బ్రహ్మోత్సవ బహుమానం రూ.15,400కు 10 శాతం అంటే రూ.1,540, కాంట్రాక్ట్‌ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగులు రూ.7,535కు అదనంగా రూ.774 పొందనున్నారు.

వివాహిత ఆత్మహత్య



గాయత్రి మృతదేహం

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో గాయత్రి (37), యువరాజ్ దంపతులు నివాసముంటున్నారు. గాయత్రి ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండగా.. యువరాజ్ కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా ఉన్నాడు. సుమారు 13 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి శశాంక్ అనే కుమారుడున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లోనే గాయత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం వద్ద పోలీసులకు ఒక సూసైడ్ లెటర్ దొరికింది. కుమారుడిని, కుటుంబాన్ని ఉద్దేశించి రాసిన ఆ లెటర్‌లో 'ఐయామ్ సారీ శశాంక్, ఐయామ్ వెరీ సారీ మై డియర్ ఫ్యామిలీ మెంబర్స్. నా చావుకు ఎవరూ కారణం కాదు' అని ఇంగ్లిషులోను, తెలుగులోను రాసి ఉంది. కుటుంబ కలహాలే గాయత్రి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అర్హులందరికీ రేషన్ : ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌బియ్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 10వ డివిజన్ పరిధిలోని 35వ చౌకదుకాణాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పులిగోరు మురళి, భరణీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ వాహనాల వేలం వాయిదా

మంగళం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి డివిజన్ అటవీశాఖ పరిధిలో ఈ నెల 17న జరగాల్సిన వాహనాల వేలం వాయిదా వేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. తిరుపతి డివిజన్ పరిధిలోని ఎనిమిది రేంజ్‌లలో ఉన్న 370 వాహనాలకు ఈ నెల 17న వేలం వేయాలని నిర్ణయించారు. అనివార్య కారణాల వల్ల వేలంపాటను తాత్కాలికంగా వాయిదా వేశారు. మరో తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న అకడమిక్ కో-ఆర్డినేటర్ శైలజ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాలుష్య నియంత్రణ మండలి అకాడమిక్ కో-ఆర్డినేటర్ శైలజ అన్నారు. తిరుపతి కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాతావరణ కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరు సీహెచ్ రాజశేఖర్, సహాయ పర్యావరణ ఇంజనీరు వి.మదనమోహన్‌రెడ్డి, శ్రీవాత్సల్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అడ్డుకున్న రోడ్డును పూర్తిచేయండి

● మంత్రిని కోరిన టీడీపీ నేతలు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కంకణాల రజిని

తిరుపతి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీనివాసం యాత్రీకుల సముదాయం ఎదురుగా పీకే లే అవుట్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి కంకణాల రజినీకాంత్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రిని ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మతో కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి లే అవుట్ ప్రాంత వాసులు సానుభూతిపరులని, గరుడ వారధి నిర్మాణం నేపథ్యంలో వైసీపీ కక్షగట్టి రోడ్డు వేయకుండా వేధించిందన్నారు. దీనిపై మంత్రి స్పందించి కమిషనర్ మౌర్యతో చర్చించారు. పరిశీలించి రోడ్డువేసేలా చర్యలు తీసుకుంటామని ఆమె సానుకూలంగా చెప్పినట్లు తెలిసింది.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్


డాక్టర్ మూడే గోవిందునాయక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : స్విమ్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థి డాక్టర్ మూడే గోవిందునాయక్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గోవిందునాయక్ ఫ్యాకల్టీ ఆఫ్ ఫిజియో థెరపీ విభాగంలో 'ఎఫెక్ట్ ఆఫ్ వర్చువల్ రియాలిటీ ట్రైనింగ్ ఆన్‌హ్యాండ్ ఫంక్షన్ ఇన్ సబ్జెక్ట్ విత్ స్ట్రోక్ : ఎరండోమైజ్డ్ కంట్రోల్ ట్రైల్' అనే అంశంపై పరిశోధనలు నిర్వహించారు. చీఫ్‌గైడ్ అండ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కుమారి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించారు. డాక్టర్ గోవిందు నాయక్‌కు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, డీన్ డాక్టర్ అలోక్‌సచన్‌లు అభినందించారు.

తిరుపతి కేంద్రంగా సీమ అభివృద్ధి

● రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్


ఆలయం ముందు మంత్రి అనగాని

తిరుమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో తిరుపతి కేంద్రంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుపతిని స్పిరిచ్యువల్ సెంటర్‌గా తీర్చిదిద్దడం సీఎం ఆకాంక్ష అన్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు స్వామి దర్శనంతో పాటు మరో రెండు మూడురోజుల సమయం కేటాయించేలా ఎకో టూరిజంను కూడా అభివృద్ధిపరచే ఆలోచనలో సీఎం ఉన్నారన్నారు. దీనిపై ఇప్పటికే తుడా చైర్మన్, అధికారులతో సమీక్షించామన్నారు. రానున్న వైకుంఠ ఏకాదశికి సంబంధించి ఇప్పటికే సీఎం సమీక్షించారని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకూడదని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. కాగా, ఇటీవల విశాఖలో జరిగిన సదస్సు ద్వారా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో దాదాపు 15 లక్షల మందికి ఉపాధి కలగబోతోందని మంత్రి చెప్పారు.

తిరుమలలో ఘనంగా చక్రతీర్థ ముక్కోటి

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం చక్రతీర్థ ముక్కోటిని నిర్వహించారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో చక్రతీర్థ ముక్కోటిని నిర్వహించడం ఆనవాయితీ. అర్చకులు, పరిచారకులు, భక్తులు ఉదయం మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీ చక్రత్తాళ్వారుకు, నరసింహస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు.



తప్పు తమ్ముళ్లూ!

తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయ ముందు మధ్యాహ్నం 2 గంటల సమయంలో బడి వదిలేవేళ కనిపించిన దృశ్యం ఇది. తాగుతున్నది మామూలు సిగరెట్టో.. గంజాయి కూరిన సిగరెట్టో తెలీదు. బడి గేటు ముందే పొగరింగులు వదులుతూ, విద్యార్థులను రెచ్చగొడుతూ హీరోయిక్ పోజులు కొడుతున్న వీరిని చూసి పిల్లల కోసం వచ్చిన తల్లిదండ్రులు ఆందోళనతో, భయంతో ఇళ్లకు కదిలారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

13న మెగా జాబ్‌మేళా

తిరుపతి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 13న గుంటూరులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గౌరవ సలహాదారుడు సి.ఆర్.శేషగిరిరావు తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య కార్యాలయంలో మెగా జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళాలో దాదాపు 50 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, 90శాతం బ్రాహ్మణ యువతీయువకులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 10 నుంచి డిగ్రీ, బీటెక్ వరకు విద్యార్హతలు ఉన్నవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘం సభ్యులు హనుమంతరావు, బాగవతుల జయలక్ష్మి, సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నేత



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను టీఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ నేత వెంకటేష్ నాయుడు కలిశారు. మంగళవారంలోని టీడీపీ కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఎస్వీయూ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, అధ్యాపకుల కొరత తీర్చాలని, విద్యార్థులకు అకడమిక్ వసతుల కల్పనకు సహకరించాలని కోరారు.

అన్వేషణ్ -2025 విజేతలకు అభినందన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం అన్వేషణ్-2025 చేపట్టింది. పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థినులు వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ నారాయణమ్మ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ అభినందించారు.

విగ్రహావిష్కరణకు విచ్చేయండి

● మంత్రి అనగానికి ఆహ్వానం

తిరుపతి(జీవకోన), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళాయూనివర్శిటీ ఎదురుగా జనవరి 3న సావిత్రియబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, బీసీ సంఘర్షణ సమితి నేతలు సాకం ప్రభాకర్, కట్టమంచి చంద్రబాబు, బీవీ కేశవులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

31లోపు అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

● విద్యుత్ ఈఈ

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తిరుపతి సర్కిల్ పరిధిలోవున్న గృహ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగం కంటే అదనంగా ఉన్న లోడ్‌ను డిసెంబరు 31వతేదీ లోపు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని టౌన్ డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్),డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జయచంద్ర టి.సుబ్రమణ్యం కోరారు. స్థానిక యశోదానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.బాలసుబ్రమణ్యం, ఈఎస్ కుమార్, మునిరాజా, నాగవెంకటేష్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వీల్‌చైర్, స్ట్రెచర్ కావాలా.. కండిషన్స్ అప్లయ్

● రోగులను తరలించేందుకు ముందుకు రాని ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు
● ఎంతో కొంత ఇస్తేనే స్ట్రెచర్, వీల్‌చైర్ ఇస్తారు
● సహాయకుల అవస్థలు


తల్లిని వీల్‌చైర్‌లో తీసుకువెళుతున్న ఓ కుమారుడు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రుయాలో వైద్యం కోసం వచ్చే రోగులు నడవలేని స్థితిలో ఉంటే వారిని స్ట్రెచర్లు, వీల్‌చైర్లలో వైద్యుల వద్దకు, వైద్యపరీక్షలకు, వార్డుల వద్దకు తీసుకువెళ్లేందుకు ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు తప్పక అందుబాటులో ఉండాలి. అయితే వారు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఎక్కువగా రోగుల సహాయకులే తమ వారిని వార్డులకు తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా స్ట్రెచర్, వీల్‌చైర్లు కావాలంటే సిబ్బంది ఏదో ఒక వస్తువు తమ వద్ద ఉంచాలని కండిషన్ పెడుతున్నారు. సెల్‌ఫోన్లు, లేదా ఇంకేదైనా విలువైన వస్తువులు తీసుకుంటున్నారు. తమవారిని వార్డుకు చేర్చాక తిరిగి వీల్‌చైర్, స్ట్రెచర్ అప్పగించాక వారి వస్తువులు వారికి తిరిగి అప్పగిస్తున్నారు. ఆ సమయంలో ఎంతోకొంత నగదు వసూలు చేస్తున్నారు. తుపానుతో మంగళవారం రుయాలో రోగులను తరలించేందుకు వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అసలు విధులు వదిలేసి..

ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు కొందరు వారి విధులను కాకుండా డీఈవోలుగా, ఓటీల్లో సహాయకులుగా స్థిరపడిపోతున్నారు. ఈ విధుల కోసం కొందరు సంబధిత అధికారుల చేతులు తడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వారు రోగులకు సాయంగా ఉండాల్సిన విధులను కాకుండా వారికి సంబంధం లేని వేరే విధుల్లో చేరుతున్నారు. ఫలితంగా రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి చర్యలు చేపడితే రోగులకు, వారి సహాయకులకు తిప్పలు తప్పుతాయి.


నడవలేని మనవడిని వీల్‌చైర్‌లో తీసుకువెళుతున్న తాత


వానలోనూ స్ట్రెచర్లపై తీసుకువెళుతున్న సహాయకులు

సభలూ, సమావేశాల నిర్వహణకు సహకరించండి

● ఎస్వీయూ అధికారులకు విద్యార్థి సంఘాల వినతి


వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలో సభలూ సమావేశాల నిర్వహణకు సహకరించాలని వివిధ విద్యార్థి సంఘాలు అధికారులను కోరాయి. వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి విన్నవించారు. అశోక్ కుమార్ (ఎస్ఎఫ్ఐ) చిన్న (ఏఐఎస్‌ఏ), ప్రవీణ్ (ఏఐఎస్ఎఫ్), శివ బాలాజీ (ఎన్ఎస్‌యూఐ), సుందర్రాజు (లా స్టూడెంట్ యూనియన్), ప్రేమ్ (వైఎస్ఆర్ఎస్‌యు), స్రవంతి (పీడీఎస్‌యూ), నవీన్ (ఏబీడీఎస్ఓ), తిరుమలేష్ (బీసీ విద్యార్థి సంఘం) తదితరులు వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల గొంతు నొక్కకుండా సామాజిక, విద్యారంగ సమస్యలపై సమావేశాలు నిర్వహించడానికి సెమినార్ హాళ్ల కేటాయించాలని కోరారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థి నాయకుల పేర్లతో మాత్రమే సెమినార్ హాళ్ళు కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. విద్యార్థి సంఘాల సమావేశాలపై పది రోజుల ముందుగానే సమాచారం ఇవ్వాలని అధికారులు కోరినట్లు విద్యార్థి నేతలు తెలియజేశారు.

షిరిడీ రైలు ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): షిరిడీ-తిరుపతి మధ్య రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభోత్సవానికి చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) చంద్రశేఖర్ గుప్తా పరిశీలించారు. షిరిడీ- తిరుపతి మధ్య నడుస్తున్న వారాంతపు రైలు స్థానంలో రోజువారీ రైలుగా మార్పు చేశారు. ఈ నెల 9న తిరుపతిలో అధికారికంగా ప్రాంభించాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు డీఆర్ఎం మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్ దక్షిణం వైపు వున్న నూతన భవనాన్ని పరిశీలించారు. 6వ నెంబరు ప్లాట్ ఫారంలో రైలు ప్రారంభించడానికి ఏర్పాటు చేయవలసిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్ఎం యు.సుధాకర్, సీనియర్ డీఓఎం డాక్టర్ శ్రావణ్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప్పరెడ్డి ,అధికారులు మణికంఠ, వామనమూర్తి, దరూరు ప్రభాకర్, మాధవరావు, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్ఎం తిరుపతి నుంచి పాకాల మీదుగా ధర్మవరం వరకు విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.

రేషన్ కోసం పడిగాపులు


పీకేలేఅవుట్‌లో రేషన్‌దుకాణం బయట వేసిఉన్న కార్డుదారులు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పీకే లేవుట్‌లోని ఓ రేషన్ దుకాణాన్ని మంగళవారం సాయంత్రం సకాలంలో తెరవకపోవడంతో పలువురు కార్డుదారులు రోడ్డుపై నిలబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ పక్క చిరుజల్లులకు తడుస్తూనే రోడ్డుపైనే నిలబడి ఎదురు చూశారు. ఉదయం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. అప్పటికే క్యూలైన్‌లో ఉన్నవారిని తిరిగి సాయంత్రం 4గంటలకు రావాలని సూచించడంతో పలువురు కార్డుదారులు సకాలానికి చేరుకున్నారు. అయితే 5గంటలు దాటినా షాపుని తెరవకపోవడంతో ఇబ్బందిపడ్డారు. కొంత ఆలస్యంగా షాపుని ఓపెన్‌చేసినా బయోమెట్రిక్ యంత్ర సమస్యతో మరికొంతసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. సోమవారం సాయంత్రం కూడా ఇలాగే సకాలంలో షాపుని ఓపెన్ తెరవలేదని పలువురు కార్డుదారులు వాపోయారు. గతంలో ఈషాపుని వేరేవీధిలో నిర్వహిస్తుండేవారని ఈనెల నుంచి పక్క వీధిలోకి మార్చడంతో పలువురు కార్డుదారులకు చిరునామా తెలియక ఇబ్బంది పడ్డారు.

బయోమెట్రిక్ తీసుకుని..

ఇదేవీధిలో మరో దుకాణం(1084032)లో కార్డుదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకుని మరుసటిరోజు వచ్చి రేషన్ తీసుకోవాలని సూచించడంతో పలువురు కార్డుదారులు విస్తుపోయారు. రేషన్ వేయింగ్ చేసే వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడిందని నిర్వాహకులు అంటున్నారు.

ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు


గోపీనాథ్‌రెడ్డిని సత్కరించిన సేవా సమాజం ప్రతినిధులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేటీరోడ్డులోని శ్రీపురం కాలనీ మలయాళ స్వామి వీధిలో గల శ్రీమలయాళ సద్గురు సేవా సమాజంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం గీతా పారాయణం చేయగా పలువురు వక్తలు తమ ప్రవచనాలను వినిపించారు. తర్వాత శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమ స్వామి సర్వాత్మానందగిరి, తిరుపతి శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి సుకృతానంద, రాచపాళెం జగన్నాథ ఆశ్రమం స్వామి శివానందగిరి, తిరుపతి ఎస్వీయు విశ్రాంత సంస్కృత విభాగాధ్యక్షులు ఆచార్య కె.ప్రతాప్, ప్రముఖ అవధాని ఆముదాల మురళీ తదితరులు ఈ గీతా జయంతి ఉత్సవాల్లో పాల్గొని తమ సందేశానిచ్చారు. రాయలసీమ రంగస్థలి కళాకారుల అధ్యక్షులు గుండాల గోపీనాథ్‌రెడ్డి విచ్చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి సభ్యులు కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, సిద్ధారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


అతిథిగృహంలో స్నేహారెడ్డి, ఆలయం ఎదుట రాకేశ్

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నటుడు రాకేశ్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు.

శేషాచలం..జలపాతాల సోయగం


తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డులో శేషాచలం కొండల నుంచి జాలువారుతున్న జలపాతం అందాలను వీక్షిస్తున్న భక్తులు.

టీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: ఈవో


ఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ హామీ ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని టీటీడీ నాలుగో తరగతి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఈవో ఆ సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై అపోహలు తొలగించండి

తిరుపతి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై ఉన్న అపోహలు తొలగించి, ప్రజలకు అవగాహన కల్పించాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి సూచించారు. తుడా ప్లానింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రుయాలో వైసీపీ వారికి అడ్డగోలుగా మెడికల్ షాపులు కేటాయించారు

డీఆర్సీలో మంత్రికి, కలెక్టర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో వైసీపీ నేతలకు అడ్డగోలుగా మెడికల్ షాపులు కేటాయించారని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్‌కి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశంలో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మతో కలసి 44వ డివిజన్ టీడీపీ నాయకుడు ఊట్ల సురేంద్రనాయుడు వినతిపత్రం అందజేశారు. తమ వార్డులోని వైసీపీ నాయకులకు నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన మెడికల్ షాపులను రద్దుచేయాలని కోరారు. మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి షాపులు రద్దుచేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.







పొగమంచు వాలింది.. ఇలగొంతు వణికింది..

మన రాష్ట్రంలో అత్యంత చల్లని ప్రదేశంగా లంబసింగిని పేర్కొంటారు. సముద్రమట్టానికి 3,300 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రదేశం శీతాకాలంలో పొగమంచు కమ్మేసి ఉంటుంది. నేలకు వాలే మబ్బులు.. వణికించే చలి.. ఈ చల్లని అనుభూతి కోసం పర్యాటకులు పరుగులు తీస్తారు. సరిగ్గా ఇటువంటి వాతావరణమే తిరుమల కొండమీద గత మూడు రోజులుగా కనిపిస్తోంది. పగలు కూడా చీకటి కమ్ముకుంటోంది. లోయల్లోకి దిగిన మబ్బులతో కనుమరోడ్లు కొత్త అందాలను పంచుతున్నాయి. పొగమంచు మబ్బులు నేలకు వాలి ఆలయ పరిసరాలు మసక మసకగా మారిపోతున్నాయి. చలికి వణుకుతూనే ఈ దృశ్యాలు నేపథ్యంగా భక్తులు ఫొటోలు దిగుతున్నారు. పట్టపగలు కూడా హెడ్‌లైట్లు వేసుకునే వాహనాలు తిరుమలలో ప్రయాణించాల్సి వస్తోంది. మంచుమబ్బులతో కనువిందు చేస్తున్న శ్రీవారి పాదాలు, పాపనాశనం, పార్వేటి మండపం ప్రాంతాలను సందర్శించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సత్యవేడులో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైంది!

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైందని, దీనిపై సీఎం చంద్రబాబును కలసి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నియంతృత్వ ధోరణి వద్దనుకునే తాను గతంలో పెద్దిరెడ్డిని ఎదిరించి వైసీపీ నుంచీ బయటకు వచ్చానని, ఇపుడు ఇంకో రెడ్డిని తెచ్చి తన మీద పెడతారా అని ప్రశ్నించారు. ప్రొటోకాల్ విషయమై ఇప్పటికే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానన్నారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పెన్షన్లు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన వచ్చు తప్ప ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తాను ప్రజా దర్బార్ పెడుతుంటే, శంకర్‌రెడ్డి ఎలా పెడతారని ప్రశ్నించారు. సురుటిపల్లి ఆలయ ఛైర్మన్‌గా బియ్యం దొంగను నియమించారని దీనిపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానన్నారు. కేవీబీపురం మండలంలో చెరువు కట్ట తెగిన ప్రమాదంలో బాధితులకు ఆశించిన స్థాయిలో సాయం అందలేదని ఆరోపించారు. చాలా విషయాలు సీఎం చంద్రబాబుకు తెలియడం లేదని, తాను నేరుగా కలసి ఆయనకు ఫిర్యాదు చేస్తానన్నారు.

పళ్లికొండేశ్వర స్వామి భక్తుల కల సాకారం

- చైర్మన్ పద్మనాభరాజు
- ఆలయ ఈవోపై ఎమ్మెల్యే బెదిరింపులకు దిగడం తగదు

నాగలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామి భక్తుల పదేళ్ల సాకారమైందని ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు మంగళవారం చెప్పారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి అందించిన రూ.15 లక్షలు, పిచ్చాటూరు మిల్క్ డెయిరీ ఎండీ మునిశేఖర్ నాయుడు అందజేసిన రూ.10లక్షలతో రథోత్సవానికి అడ్డంకులు తొలగాయన్నారు. రథం వెళ్లే దారిలో ఉన్న ఇంటికి ఆ డబ్బు చెల్లించి తొలగిస్తున్నామని చెప్పారు. దాతలను సన్మానించడం తమ బాధ్యతని, దీన్ని వక్రీకరించడం తగదని ఎమ్మెల్యే ఆదిమూలానికి హితవు పలికారు. ఇలాంటి ఆరోపణలతో ఆలయ పవిత్రత దెబ్బతింటుందన్నారు. తనపై ఎలాంటి కేసులు లేవని, బ్రాందీషాపు లైసెన్స్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రొటోకాల్ విషయానికి వస్తే 15 రోజులకు ఒకసారి వచ్చే ప్రదోషాల ఆహ్వానంలో ఎమ్మెల్యే పేరు వేయాల్సిన అవసరం లేదన్నారు. శివరాత్రి ఉత్సవాలకు మాత్రమే ప్రొటోకాల్ వర్తిస్తుందన్నారు. దేవదాయ చట్టానికి లోబడి నడుచుకుంటున్న ఈవోపై బెదిరింపులకు దిగడం ఎమ్మెల్యేకు తగదన్నారు. పాలకమండలి సభ్యులు హంసరుద్రయ్య, కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులునాయుడు, నాగభూషణమ్మ, నెల్సన్ మండేలా, జయంతి, దేవి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గూడూరు జేఏసీ నేతలు

- జేఏసీ నేతల డిమాండ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయండి. లేదంటే నెల్లూరు జిల్లాలో కలపండి అంటూ జేఏసీ కమిటీ సభ్యుడు దశరధరామిరెడ్డి డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం వీరు కాసేపు ధర్నా చేశారు. ఈ విషయంలో ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తమకు నెల్లూరు దగ్గరగా ఉంటుందని.. ఈ దిశగా సీఎం చంద్రబాబు గూడూరును ఆ జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగానిసత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రభాకర్, శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు. ● కాగా, తిరుపతి రూరల్ దామినేడు భూములను 22ఏ నుంచి తొలగించాలని పలువురు మంత్రికి వినతిపత్రం అందించారు. తమ భూముల్లో కోర్టు కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తమకు న్యాయంచేయాలంటూ మరికొందరు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు శ్రీవారిసేవకులు

- 'ట్రైయిన్ ద ట్రైనీస్' శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో




తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని సేవాసదన్-2లో మంగళవారం మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారిసేవను మరింత బలోపేతం చేయడం కోసం 'ట్రెయిన్ ద ట్రైనీస్' పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు ఈవో చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన గ్రూప్ సూపర్వైజర్లు (మాస్టర్ ట్రైనర్లు) పేర్లు నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే ఆయా ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే శిక్షణ అందించి వారిని భక్తులకు ఉన్నతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏపీ ప్రణాళికా విభాగం, ఐఐఎం-అహ్మదాబాద్ నిపుణులు శిక్షణ మాడ్యూల్‌ను రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పండితులు మేడసాని మోహన్, దామోదర్ నాయుడు, శ్రీనివాస్, చీఫ్ పీఆర్వో రవి, పీఆర్వో నీలిమ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే




రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ



రణ్‌వీర్ క్షమాపణలు

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

పుత్తూరు వార్తలు

నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చండి

● మంత్రి అనగానికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విజయబాబు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరి నియోజకవర్గాన్ని అనైతికంగా విభజించారని, రెండు మండలాలను తిరుపతి జిల్లాలో, మూడు మండలాలను చిత్తూరు జిల్లాలో చేర్చడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రజాభీష్టం మేరకు విలీన ప్రక్రియ చేపట్టాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి విలీన అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

సదాశివకోన అభివృద్ధికి రూ. 60 లక్షల మంజూరు

వడమాలపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివకోనలో సదాశివేశ్వరుడి ఆలయగోపుర పునర్నిర్మాణానికి రూ.60 లక్షల మంజూరైనట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. సదాశివకోనలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ గోపుర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా దేవదాయ శాఖకు ప్రతిపాదించారు. దీంతో మంత్రి ఆనం రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

జలకళతో చెరువులు



కలుజు పారుతున్న గూళూరు చెరువు

పుత్తూరు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దిత్వా తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలతో 11 చెరువుల్లో గూళూరు, నేషనూరు, రామకృష్ణాపురం చెరువులు కలుజులు పారుతున్నాయి. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో నీరు చేరడంతో రైతులు అప్రమత్తంగా ఉన్నారు.

పొంగిపొర్లుతున్న నక్కలవాగు



వడమాలపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు సమీపంలోని నక్కలవాగు వర్షాలకు పొంగిపొర్లుతోంది. గాజుల మధ్యం పారిశ్రామికవాడ నుంచి కల్లూరుకు వెళ్లే రోడ్డుపై నక్కలవాగు సుమారుగా మూడు అడుగుల మేర ప్రవహిస్తోంది. కల్లూరు వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. వడమాలపేట నుంచి టీసీ అగ్రహారం మీదుగా చేరుకుంటున్నారు.

పుట్‌ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయించండి

పుత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మరాజుల గుడి ఎదురుగా రైల్వే ట్రాక్ సమస్యను అధిగమించేందుకు పుట్‌ఓవర్ బ్రిడ్జి, ర్యాంపును నిర్మించేలా రైల్వే మంత్రితో చర్చించాలని ఎంపీ గురుమూర్తికి మాజీ మంత్రి రోజా వినతి పత్రాన్ని అందించారు. ఈ ప్రాంతంలో రైల్వే లైనును గేటు పుత్తూరు ప్రజలతో పాటు పది గ్రామాల ప్రజలు దాటుతున్నారని అన్నారు. చెన్నై- ముంబై మధ్య రైళ్ల సంఖ్యతో పాటు వాటి వేగం కూడా పెరిగిందని తెలిపారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతాయని రైల్వే శాఖ ఇనుప స్తంభాలు అడ్డంగా పెట్టి రాకపోకలు మూసివేసిందన్నారు. ప్రత్యామ్నాయం లేక ప్రజలు లైన్లను దాటుతున్నారన్నారు. ఈ సమస్యను కేంద్ర రైల్వే మంత్రికి వివరించి పుట్ ఓవర్‌బ్రిడ్జిని మంజూరు చేయించాలని ఆమె కోరారు.

జూడోలో విద్యార్థినుల ప్రతిభ




పతకాలతో ప్రణతి, యామిని

వడమాలపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వడమాలపేట విద్యార్థిని ప్రణతి రజత పతకం సాధించింది. శ్రీ సత్యసాయి జిల్లా చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్14 జూడో పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ప్రణతి 36 కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించింది.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): మండలం పాపానాయుడుపేట జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యామినికి రాష్ట్రస్థాయి అండర్ -14 జూడో పోటీల్లో కాంస్య పతకం వరించింది. సత్యసాయి జిల్లా చిగిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ జరిగాయి. అందులో అండర్-14 జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జట్టుకు యామిని ప్రాతినిధ్యం వహించింది. 44కిలోల జూడో విభాగంలో కాంస్యం సాధించింది.

కాళంగి జలాశయం నాలుగు గేట్ల ఎత్తివేత



కేవీబీపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్షాలు కారణంగా కాళంగి జలాశయం నీటి మట్టం పెరుగుతోందని దీనిని ఎప్పటికపుడు పరిశీలిస్తున్నట్టు ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి చెప్పారు. మంగళవారం ఉదయానికి నీటి మట్టం 18.6అడుగులకు చేరడంతో వెంటనే సిబ్బంది 8 గేట్లలో నాలుగు గేట్లను మూడు అడుగుల మేర లేపి నీటిని బయటకు విడుదల చేశారు. ఇంకా నీటి మట్టం పెరిగితే మరో రెండు గేట్లు ఎత్తుతామని తెలిపారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్పీవీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా మహమ్మారిపై ఆర్‌ఆర్‌సీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నివారణ చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు, వైస్‌ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు రాజేంద్ర, గంగారామ్, చంద్రమౌళి, పరంధామయ్య, సుధీర్, సునీత, తులసి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యా వలంటీరు పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

వాకాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ మనపాళెం ప్రాథమిక పాఠశాలలో విద్యా వలంటీరు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో నసీం అలీ తెలిపారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

కారును ఢీకొన్న లారీ

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సర్కిల్ వద్ద మంగళవారం కారును లారీ ఢీకొంది. సూళ్లూరుపేట నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేసే సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది.

యువకుడి అదృశ్యం

బాలాయపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలిమిలి గ్రామానికి చెందిన పొట్టేళ్ల శీనయ్య కుమారుడు ప్రసన్న కుమార్(32) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని అతని తండ్రి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



కోట మండలం ఊనుగుంటపాళెం సమీపంలో డంప్ చేసిన ఇసుక - ఇసుక అయిపోవడంతో ఖాళీగా ఉన్న విద్యానగర్‌లోని బిసిల్టింగ్ కేంద్రం

ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

స్వర్ణముఖి బఫర్ జోన్‌లో తవ్వకాలు ● చెన్నై, బెంగళూరుకు తరలించి విక్రయం

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్వర్ణముఖినది బఫర్ జోన్‌లో తవ్వి చెన్నై, బెంగళూరు నగరాలకు తరలించి విక్రయించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పింది. ఇందుకు అనుగుణంగా కోట మండలం గూడలి వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. స్వర్ణముఖినదిలో తవ్విన ఇసుకను విద్యానగర్‌లో బిసిల్టింగ్ కేంద్రంలో డంప్ చేసి, అవసరమైన వారికి సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం వర్షాల వల్ల స్వర్ణముఖిలోకి నీరు చేరడంతో రీచ్ యాజమాన్యం తవ్వకాలు నిలిపివేసింది. అలాగే డంప్ చేసిన ఇసుక అయిపోయింది. ఇదిలా ఉండగా స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కోట మండలంలోని రుద్రవరం, చిట్టమూరు మండలంలోని మెట్టు ప్రాంతంలో స్వర్ణముఖి బఫర్ జోన్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఊనుగుంటపాళెం సమీపంలో అటవీ ప్రాంతంలో డంప్ చేసి, ఇక్కడ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు తరలిస్తున్నారు. ఇసుక దొరక్క స్థానికులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు మాత్రం ఉచితం మాటున బయట ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల వద్ద రోడ్డుపై వర్షపునీరు - తడ: కాదలూరు - వెండ్లూరుపాడు రోడ్డుపై ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎడతెరపిలేని వర్షం

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి సూళ్లూరుపేటలో ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు, కాలువలతో పాటు కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. మంగళవారం ఉదయం నుంచి జోరువాన కురువడంతో సాయినగర్, ఆర్యభట్టనగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగి రోడ్ల మీదకు వర్షపునీరు చేరింది. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సాయినగర్ ప్రాంతాలను పరిశీలించి అప్రజలను అప్రమత్తం చేశారు. షార్‌కు వెళ్లే రోడ్డులో డిగ్రీ కళాశాల వద్ద వర్షపునీరు రోడ్డు మీదకు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇలుపూరు - మంగళంపాడు మార్గాల మధ్యనున్న డొండ కాలువ వంతెనపై ఒక అడుగు మేరు నీరు చేరింది.

పరవళ్లు తొక్కుతున్న పులికాట్

దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కుస్తున్న వర్షాలతో పులికాట్‌కు భారీగా వరదనీరు చేరింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో పులికాట్ చల్లని గాలులల నడుమ సముద్రాన్ని తలపించేలా అలలు పరవళ్లు తొక్కుతోంది. సరస్సుకు భారీగా నీరు చేరడంతో శ్రీహరికోట రోడ్డుకు ఇరువైపులా జాలర్ల విసురు వలలు వేసి చేపల వేట సాగిస్తున్నారు.

కోటలో కుండపోత

కోట: మండలంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపిలేకుండా వర్షం పడడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, కాకితోపు, వెంకన్నపాళెం, రాజుపాళెం తదితర గ్రామాల్లోని వరి నారుమడులు, నాట్లు వేసిన పైర్లు నీట మునిగాయి. గూడలి పంచాయతీ పరిధిలోని దక్షిణ పొలంలో వారం రోజుల క్రితం నాటిన పుచ్చ పూర్తిగా దెబ్బతింది. అదే విధంగా కోట క్రాస్‌రోడ్డు వద్ద స్వర్ణముఖినది నుంచి చల్లకాలువలోకి వెళ్లే ప్రధాన కలుజు ఓవర్ ఫ్లో అయి పరవళ్లు తొక్కడంతో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఆర్‌ఐ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం లాక్‌లను బిగించారు.

బ్యారేజీ నుంచి దిగువకు వరద

వాకాడు: మండలంలోని స్వర్ణముఖినది బ్యారేజీలోకి 7 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని, ఎనిమిది గేట్‌లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చెరువులన్నీ పూర్తిగా నిండి పోయాయని, దీంతో వరద నీటిని దిగువకు వదులుతున్నామని ఆయన చెప్పారు.



నాయుడుపేట మండలం పుదూరులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు - పెళ్లకూరు మండలం జీలపాటూరులో నీట మునిగిన వరి

నీట మునిగిన పొలాలు

పెళ్లకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిల్లకూరు, జీలపాటూరు, పెళ్లకూరు, టెంకాయతోపు తదితర గ్రామాల్లో వరి పైరు నీటమునిగింది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అన్ని చెరువులు నిండిపోయి ప్రమాదకర పరిస్థితికి చేరుకున్నాయి.

వాకాడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు జలమయం అయ్యాయి. తిరుమూరు, దుగరాజపట్నం, రావిగుంటపాళెం, వాకాడు, సిద్ధిగుంటపాళెం తదితర గ్రామాల్లో వరి పొలాలు నీటమునిగాయి.

నాయుడుపేట టౌన్: మండలంలో నాలుగు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖినదికి ఎగువ నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో నారుమడులు వేసేందుకు సిద్ధంగా ఉన్న పొలాల్లో వర్షపునీరు ప్రవహిస్తోంది. వర్షాలు ఎక్కువైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత సెంటర్లకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

బస్సుపై కూలిన విద్యుత్ స్తంభం



వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలం పాండూరు ప్రధాన రహదారి సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో వెంగారెడ్డి కండ్రిగ నుంచి కార్మికులతో వెళుతున్న అపాచీ పరిశ్రమ బస్సుపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. కార్మికులు అప్రమత్తమై బస్సు దిగి పరుగులు పెట్టారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.

ఓవర్ బ్రిడ్జిపై ఆగిన పల్లె వెలుగు బస్సు



రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఓవర్ బ్రిడ్జిపై ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు హఠాత్తుగా ఆగింది. ప్రయాణికులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వస్తున్న పల్లెవెలుగు బస్సు రేణిగుంట పట్టణంలోని వంతెనపై వెళ్తుండగా టైరు పేలిపోయి ఆగిపోయింది. అదనపు టైరు లేకపోవడంతో మరో బస్సులో ఎక్కి వెళ్లాలని డ్రైవర్ తెలిపారు. వర్షం పడుతుండడంతో అరగంట పాటు ప్రయాణికులు ఆపుతున్న ఒక్క బస్సు కూడా నిలపకుండా వెళ్లాయి. దీంతో మహిళా ప్రయాణికుడు కండక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటుగా వస్తున్న మరో పల్లెవెలుగు బస్సును ఆపి ప్రయాణికులను తిరుపతికి తరలించారు.


ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పిచ్చాటూరు, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ ఇద్దరి అరెస్టు చేవారు. ఎస్‌ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు... తమిళనాడుకు చెందిన శకుంతల(53), మనోజ్(23) అనకాపల్లి నుంచి గంజాయి కొనుగోలు చేసి చెన్నై సహా పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గత నెల 30న గంజాయి తరలిస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరులుకు సమాచారం అందింది. సిబ్బందితో వారిని పిచ్చాటూరులో అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈక్రమంలో నిందితులను మంగళవారం రిమాండు తరలించారు. ట్రైనీ ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ వెంకటరాజు, హెడ్ కానిస్టేబుల్ చంద్రబాబు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సముద్రంలో భీకర అలలు



కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సముద్రం అలజడులతో కల్లోల భరితంగా మారింది. యమదినెపాళెం, శ్రీనివాసనత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల వద్ద సముద్రం భీకర శబ్దాలతో అలలు ఎగిసిపడుతున్నాయి. అదే విధంగా శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం 30 మీటర్లు ముందుకొచ్చి కోతకు గురైనట్లు మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రం ఒడ్డున ఉన్న వలలు, పడవలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారు. ఎన్నడూలేని విధంగా సముద్రంలో అలలు ఎగిసిపడుతూ ముందుకు దూసుకొస్తుండటంతో తీరప్రాంత గ్రామాలు భయంగుప్పెట్లో ఉన్నాయి. గోవిందపల్లిపాళెం వద్ద ఉన్న బకింగ్‌హమ్ కెనాల్ వరదనీటితో పరవళ్లు తొక్కుతుండటంతో చప్టాపై నీటి ప్రవాహం కారణంగా మత్స్యకార గ్రామానికి దారి సౌకర్యం లేకుండా పోయే ప్రమాదం ఉంది. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఎస్‌ఐ పవన్ మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



హరి (ఫైల్ ఫొటో)

వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీ మిట్టహరిజనవాడ సమీపంలో గొర్రెలకాపరి గొర్రెలు మేపుతుండగా ఓ గొర్రె పాడుబడిన మరుగుదొడ్డిలోకి వెళ్లింది. ఆ గొర్రెను తరిమేందుకు వెళ్లగా ఆ బాత్‌రూంలో మృతదేహం కనపడడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మల్లికార్జున్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట హరిజనవాడకు చెందిన పోలూరు హరి(31)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో 12 మందిపై పీడీ యాక్ట్, ఎన్‌డీపీఎస్ నమోదు అరెస్టు చేయగా, అందులో తడకు చెందిన నల్లు మురళి, దారా ప్రసన్న ఉన్నారన్నారు. నల్లు మురళీపై ఇప్పటికి 7 గంజాయి కేసులు నమోదు కాగా, ఘర్షణలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించడంతో దారా ప్రసన్నపై 15కేసులు నమోదై ఉన్నాయన్నారు. వారిపై పీడీయాక్ట్ నమోదుచేసి జైలు శిక్ష పడేలా చేశామన్నారు. అలాగే మరి కొందరు రౌడీషీటర్లపై నిఘాపెట్టామని, భవిష్యత్తులో వారిలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

సురక్షితంగా బయటపడ్డ విద్యార్థులు



సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిధిలోని దావాదిగుంట వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 20 మంది విద్యార్థులు, నలుగురు టీచర్లు ఉన్నారు. ఎవరికీ ఏమీ కాలేదు. పోలీసుల కథనం మేరకు... గొల్లలములువు వద్దనున్న సీబీఎస్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు కారిజాత రోడ్డు మీదుగా షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలేనికి విద్యార్థులను తీసుకెళ్తుండగా దావాదిగుంట సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు దింపాడు. టైర్లు రోడ్డు మార్జిన్ మట్టిలో కుంగిపోయి పక్కనే ఉన్న సాగునీటి కాలువ గట్టు మీదకు బస్సు ఒరిగిపోయింది. వెంటనే సమీపంలో ఉన్న రైతులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని విద్యార్థులను, టీచర్లను బయటకు తీసి షార్ ఉద్యోగుల కాలనీలోని సతీష్ ధావన్ మెమోరియల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఎవరికీ ఏమీ కాలేదని చెప్పారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ బోల్తాపడిన బస్సును పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బస్సు పడిపోయిన విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమి కాలేదని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓబుల్‌రెడ్డి సేవలు మరువలేనివి



కార్మికుడికి బహుమతి అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధి ప్రసాద్

తడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తడలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి పునాది వేసిన నిప్పో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆ పరిశ్రమ చీఫ్ ఆపరేషన్, క్వాలిటీ ఆఫీసర్ పీఎల్‌ఎన్ ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి శతజయంతి, వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తడలో 1978లోనే పరిశ్రమలు ఏర్పాటు చేసిన ఓబుల్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఎన్నో ప్రజోపకార పనులను చేసి ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. పరిశ్రమలో 25, పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీల్లో విజేతలైన పరిశ్రమ ఉద్యోగుల కుటుంబసభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ రమేష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

గూడూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఉత్తమ సేవలు అందించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న వైద్యుడు, సిబ్బందిని మంగళవారం ఏపీ జీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్) గూడూరు తాలుకా గౌరవాధ్యక్షుడు మస్తానయ్య, అధ్యక్షుడు శేఖర్‌రావు సన్మానించారు. ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ, టెక్నీషియన్ మౌలాలి, సిబ్బంది బాబురావు, ఆదిశేషయ్య, దిలీప్ సోమవారం తుమ్మపల్లి కళాక్షేత్రంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. బుధవారం ఆస్పత్రి వారిని సన్మానించారు.

మంత్రి అనగానిని కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి డీఆర్సీ సమావేశానికి విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే కలసి శాలువ కప్పి సత్కరించారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఎమ్మెల్యే కలసి నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని వివరించి బాగు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

48 గంటల దీక్ష చేపట్టిన రైల్వే రన్నింగ్ స్టాఫ్

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ రైల్వే రన్నింగ్ స్టాఫ్ దీక్షకు దిగారు. మంగళవారం ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపుమేరకు రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని క్రూ లాబీ వద్ద 48 గంటల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డివిజనల్ సెక్రటరీ జయరాం, ప్రెసిడెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ... లోకో పైలట్లకు, అసిస్టెంట్ లోకో పైలట్లకు నాలుగు నైట్ డ్యూటీలకు బదులు రెండు నైట్ డ్యూటీలు మాత్రమే వేయాలని డిమాండ్ చేశారు. అలాగే డీఏ 50 శాతం పెరిగిందని, రన్నింగ్ అలవెన్స్ పెంచాలన్నారు. హెడ్ క్వార్టర్స్ నుంచి విధులకు వెళ్లిన తరువాత 36 గంటల్లో తిరిగి చేరుకునే విధంగా డ్యూటీలు వేయాలన్నారు. 70 శాతం మైలేజీపై ఐటీ రిడక్షన్ రెడక్షన్ ఇవ్వాలని కోరారు. శ్రీధర్, రామకృష్ణ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీడని వాన జల్లు

వాగులు, వంకల్లో పెరుగుతున్న నీటి ప్రవాహం ● నిండుకుండల్లా చెరువులు





స్వర్ణముఖిలో పెరిగిన నీటి ప్రవాహం - కోవనూరు వద్ద ఉధృతంగా కాళంగి కాలువ - తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాలపై వాన జల్లుల ప్రభావం వీడటం లేదు. నాలుగు రోజులు నుంచి దిత్వా ప్రభావంతో శ్రీకాళహస్తి పట్టణం, తొట్టంబేడుతో పాటు తూర్పున ఉన్న పలు మండలాల్లో వాన జల్లులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం వర్షం నమోదు కొంత పెరిగింది. ఎగువన కురుసిన వర్షాలతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం అంతకంతకు పెరుగుతోంది. శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదిలో నీటి ఉధృతి మంగళవారం పెరిగింది. తొట్టంబేడు మండలం కారాకొల్లు వద్ద ఇదే కాలువ నీటి ప్రవాహం పెరగడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. ముళ్లపూడి ఎస్టీసెంటర్, ఓబులాయపల్లి, మంగళపురి గ్రామాల వద్ద వాగుల్లో నీరు పెరిగే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల వద్ద అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ముసురు వాతావరణంతో గ్రామాల నుంచి పట్టణానికి రాకపోకల గణనీయంగా తగ్గిపోయాయి. పట్టణవాసులు చలి వాతావరణంతో ఇంటికే పరిమితమయ్యారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులు నిండి మొరవ పోతున్నాయి. పిచ్చాటూరు- శ్రీకాళహస్తి ప్రధాన రహదారి తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువ పొంగి పొర్లుతోందని తహసీల్దారు రోశయ్య చెప్పారు. తిమ్మసముద్రం వద్ద, కోవనూరు వద్ద కాళంగి కాలువలు ఇంకా పొంగితే రాకపోకలు ఆపివేస్తామని చెప్పారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని వాగులు, వంకలు పారుతున్నాయి. చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. వెస్ట్‌వరత్తూరు - కారణి మధ్య కాజ్‌వేపై నీరు ప్రవహిస్తుండడంతో ఎస్‌ఐ హరిప్రసాద్, వీఆర్వో మురళి ఆధ్వర్యంలో రోడ్డుపై కంపలు వేశారు. ఆలత్తూరులోని పంది కాలువ, కాటూరు ఏరు ప్రవహిస్తున్నాయి. వరి, మిరప, వేరుశనగ పంటల్లో నీరు చేరింది.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు నక్కల వాగు పొంగింది. మంగళవారం అత్తూరు గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న నక్కల వాగుపొంగి పొర్లుతోంది. మధ్యాహ్నం నుంచి గ్రామానికి రెండువైపులా రాకపోకలు ఆగిపోయాయి.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగుల పాళెం - కొత్తవీరాపురం మధ్య స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామీణులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మునగపాళెం - గోవిందవరం గ్రామాల మధ్య కూడా ఇదే పరిస్థితి. మంగళవారం సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో ఉధృతి తగ్గినట్లు గ్రామస్తులు చెప్పారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలం బత్తులవల్లం చెక్‌పోస్టు రహదారిపై కారిపేటి కాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. శ్రీసిటీలోని పరిశ్రమలకు ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపైన వాహనదారులు ప్రమాదం జరగకుండా తహసీల్దార్ సుధీర్ చర్యలు తీసుకున్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో సత్యవేడు మండలంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడ తెరపి లేని వర్షం కురిసింది. వీధులన్నీ జలమయమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు చిత్తడిగా మారాయి.




వెస్ట్‌వరత్తూరు- కారణి కాజ్‌వేపై పారుతున్న నీరు - మొరవ పోతున్న పల్లమాల చెరువు

నేత్రపర్వంగా బాలదీపాల వెలిగింపు



బాల దీపాల ఊరేగింపు



శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం బాల దీపాలను శాస్త్రోక్తంగా వెలిగించారు. ఏటా కార్తీక పౌర్ణమిని(తమిళ) పురస్కరించుకని మహానంది వద్ద చుక్కాని ఉత్సవం(భరణి దీపం) వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకకు ఒకరోజు ముందుగా బాలదీపాలను వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్ల గర్భాలయాలను శుద్ధి చేశారు. ఆగమ నియమం ప్రకారం అమ్మవారి సన్నిధిలో మంగళవారం రాత్రి వేద పండితులు ప్రత్యేక పూజలతో హోమ జ్వాల నుంచి ఐదు బాలదీపాలను సంప్రదాయబద్ధంగా వెలిగించారు. అనంతరం బాలదీపా లను వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొలువు దీర్చారు. బుధవారం సాయంత్రం బాలదీపాలను వేదపండితులు ఊరేగింపుగా చుక్కాని వద్దకు తీసుకెళ్లనున్నారు. అక్కడ బాలదీపాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం చక్కాణి (భరణిదీపం)ను ప్రజ్వలించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. మంగళవారం రాత్రి బుధవారం భరణి దీపం వరకు బాల దీపాలు నిరంతరం వెలిగేలా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేశారు.

నేడు భరణి దీపం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి చుక్కాని(భరణి దీపం) వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులు విశేషంగా దర్శించుకునేందుకు విచ్చేస్తారు. ఇందుకు అవసరమైన తాటిచెట్లు, మట్టలు, పూజాద్రవ్యాలను అధికారులు సిద్ధం చేశారు.

ఇసుకతాగేలి చెరువు కలుజు గండి పూడ్చివేత



ఇసుకతాగేలి చెరువుకు పడిన గండిని జయకుమార్ ఆధ్వర్యంలో పూడ్చుతున్న రైతులు

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకతాగేలి చెరువు కలుజు గండిని సకాలంలో పూడ్చారు. వర్షాలకు చెరువు మొరవ పారు తోంది. ఈ క్రమంలో కలుజు పక్కనే గండి పడింది. నీరు వృథాగా పోతుండడంతో సమాచారం అందుకున్న తహీసల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం నీటి పారుదశాఖ అధికారులతో కలిసి చెరువులు పరిశీలించారు. ఏఈ జయకుమార్ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు.

శాస్త్రోక్తంగా త్రయోదశి పూజలు



నాగలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాభిషేకం, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి అలంకరించి హారతులు చేపట్టారు. ప్రదోష పూజానంతరం మరకదాంబిక సమేత వాల్మీకేశ్వరస్వామి ఉత్సవర్లకు ప్రాకారోత్సవం నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

డీఆర్సీలో ఎమ్మెల్యే సుధీర్ వినతి



ప్రసంగిస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఇన్‌ఛార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే సుధీర్ కోరారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

ముక్కంటి సేవలో ఏపీ సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న



శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం ఏపీ సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జనార్దనరాజు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



బురదమయంగా పాలమంగళం కాజ్‌వే

నారాయణవనం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పాలమంగళం కాజ్‌వే చిత్తడిగా మారింది. దిత్వా తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలకు కాజ్‌వే బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. మొంథా తుఫాన్‌తో కాజ్‌వే కొట్టుకుపోవడంతో, అధికారులు తాత్కలికంగా గ్రావెల్ వేసి రాకపోకలు పునరుద్ధరించగా దిత్వా దెబ్బకు బురదమయమైంది.



చిత్తడిగా మారిన గొల్లకండ్రిగ రహదారి

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. మంగళవారం తుంపర్లు పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లోని వీధుల్లో నీరు నిలిచి మురికి కూపాలుగా మారాయి.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఎమ్మెల్యే సుధీర్

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు అందిస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి స్థలాలు చూపకుండా మోసం చేశారన్నారు. ప్రస్తుతానికి అర్హులైన పేదలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటే నమోదు కావడం లేదన్నారు. సుమారు 3 వేల మందికి స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లారు.

పార్టీలోకి ఎవరొచ్చినా స్వాగతించాల్సిందే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

సత్యవేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పార్టీలోకి ఎవరొచ్చిన స్వాగతించాలని తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సత్యవేడు పట్టణంలోని భేరిశెట్టి కల్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత ఎన్నికలపె సమావేశం నిర్వహించారు. పరిశీలకుడిగా హాజరైన మర్రెడ్డి మాట్లాడుతూ... ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని కలుపుకుని ముందుకు సాగితేనే బలోపేతమవుతామన్నారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికే పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు పొరబాట్లుచేసిన మాట వాస్తవమేనని అయితే గతాన్ని మరచి అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మరో పరిశీలకుడు సురేష్ రాజు మాట్లాడుతూ... క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీ బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తే ఉపేక్షించబోమన్నారు. నియోజకవర్గంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో సంస్థాగత ఎన్నికలు ఆలస్యమయ్యామన్నారు. కార్యకర్తల మెజారిటీ అభిప్రాయం మేరకు తుది నిర్ణయాలు ఉంటాయన్నారు. మండలంలో 28 పంచాయతీల్లో షెడ్యూల్ ప్రకారం పరిశీలకులు పర్యటించే అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. ల్సిందేనని తేల్చి చెప్పారు. గ్రామ కమిటీ లోను, మండల కమిటీల్లోను పోటీ ఏర్పడితే ఐవీఆర్ఎస్ ద్వారా తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. రమణారెడ్డి, వెంకటేష్ యాదవ్, మస్తాన్, పరమశివం, శివకుమార్, లోకయ్యరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాధయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో హ్యాండ్స్ - ఆన్ వర్క్‌షాప్



కాన్ఫరెన్సులో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు



ప్రసంగిస్తున్న డాక్టర్ అమిత్ సక్సేనా

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో క్వాంటం నాలెడ్జ్ క్లస్టర్ తిరుపతి ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటం అల్గారిథమ్స్, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్‌పై రెండురోజులపాటు జరిగే జాతీయ స్థాయి హ్యాండ్స్- ఆన్ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జాతీయ క్వాంటం మిషన్ కింద ఐఐటీ మద్రాస్‌కు చెందిన సంజ్ఞాన క్వాంటం కమ్యూనికేషన్ హబ్ నిధులతో, సీ-డాక్ విజ్ఞాన భాగస్వామ్యంతో ఏర్పాటైంది. వర్క్‌షాప్‌ను డాక్టర్ అరిజిత్‌శర్మ, డాక్టర్ అరవింద ఎస్(తిరుపతి ఐఐటీ), డాక్టర్ సంపుద్ధసన్యాల్(తిరుపతి ఐసర్) సమన్వయం చేస్తున్నారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్, సీడాక్ పూణే నిపుణులు క్వాంటం టెక్నాలజీపై బోధన, హ్యాండ్స్ ఆన్ శిక్షణ అందించారు. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్, అల్గారిథమ్స్ సెక్యూర్ కమ్యూనికేషన్, ఎర్రర్ కరెక్షన్ వంటి కీలక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. సుమారు 80మంది అధ్యాపకులు, విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా క్యూకేసీటీ కీలక అడుగు వేసిందని ప్రతినిధులు తెలిపారు.

నిత్యావసరాల వితరణ

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని బైపాస్‌రోడ్డుకు సమీపంలోని లంకమిట్ట గిరిజన కాలనీకి చెందినకు సంఘసేవకుడు కోటేశ్వరరాబు నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఆమె భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబు మాట్లాడుతూ పిల్లల చదువుకు తన వంతు సాయం చేస్తానన్నారు. బండి కన్నయ్య, శైలజ, గంగయ్య, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.